

చేప పిల్లల పంపిణీ

వాజేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గిరిజన సొసైటీలతోపాటు 15 గ్రామాల్లోని గిరిజను లకు సోమవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. మత్స్యశాఖ అధికారి రమేష్, పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. మండల వ్యాప్తంగా 2.10 లక్షల చేపపిల్లలను పంపిణీ చేసినట్టు వారు తెలిపారు. చేపపిల్లల పెంపకంతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు కష్టకాలం



- పంచాయతీ ఎన్నికల ఖర్చు భారంతో సతమతం
- ఎన్నికల నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం
- జేబులో నుంచి ఖర్చు పెట్టుకుంటున్న వైనం
- నామినేషన్ల ఏర్పాట్లకే రూ. 25వేల వరకు ఖర్చు
- పోలింగ్ రోజు మరింత ఖర్చు
- ఎవరికీ చెప్పుకోలేని ఇబ్బందికర పరిస్థితి

హనుమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు' అన్నట్టుగా మారింది పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లకు కార్యదర్శులకు చేతిచమురు వదులుతోంది. ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా నిధులేమి ఇవ్వకపోవడంతో ఖర్చు భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో కార్యదర్శుల పాత్ర కీలకం. అన్ని దశల్లో వారి భాగస్వామ్యం తప్పని సరి. మరీ ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ నిర్వహణ తదితర దశల్లో వారు ముందుండాల్సి ఉంటుంది. కనుక పోలింగ్ సిబ్బందికి అవసరమైనవన్నీ వారే దగ్గరుండి సమకూర్చాలి. ఇందు కోసం కార్యదర్శులు ప్రస్తుతం తమ జేబులోంచి ఖర్చుపెట్టుకోవలసి వస్తోంది.

ఏర్పాట్లపై ఖర్చు

ఉమ్మడి జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. నామినేషన్ల స్వీకరణకు మూడు నాలుగు పంచాయతీలకు కలిపి ఒక క్లసర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు., ఒక్కో జిల్లాలో వాటి పరిధిలోని పంచాయతీల సంఖ్యను బట్టి 60 నుంచి 70 క్లస్లర్ల చొప్పున ఏర్పాటు చేశారు. గత నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మూడో విడతకు ఉపసంహరణల ఘట్టం మంగళవారం ముగుస్తోంది.

నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణలు, గుర్తుల కేటాయింపు, పోలింగ్, ఫలితాల వెల్లడి ఇలా పదిహేను రోజుల ప్రక్రియ. నామినేషన్ల స్వీకరణ కోసం ఒక్కో క్లస్టర్ కేంద్రంలో ఆర్వో, ముగ్గురు నుంచి నలుగురు ఏఆర్వోలు, నలుగురు పోలీసులు, అయిదాగురు సహాయకులు, ఇతరత్రా సిబ్బందిని నియమించారు. వీరికి నిత్యం కేంద్రాల వద్ద అల్పాహారం, భోజనం, తాగునీరు, నామినేషన్లు వేయడానికి వచ్చే వారికి నీడ కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదే. మౌఖిక ఆదేశాలతో కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ప్రస్తుతం వారే భరిస్తున్నారు. దీనితో ఇప్పటికే రూ 20 నుంచి రూ. 25వేల వరకు చేతి చమురు వదిలింది. మొదటి రోజు కొన్ని చోట్ల హాస్టళ్ల, పాఠశాలల్లో వండిన బోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

సిబ్బంది ఇష్టపడకపోవడంతో మరు సటి రోజు ప్రత్యేకంగా వంటలు చేయించినట్లు తెలిసింది. ఇది ఇంతటితోనే అయిపోలేదు. ఈనెల 11, 14, 17 తేదీల్లో మూడు విడత పోలింగ్ ఉంది. ఆ రోజు కూడా వీరు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను (మిగతా 8వ పేజీలో..)

కథ కంచికేనా..?!



- సీసీఐ కొనుగోళ్ల కాకిలెక్కలపై విచారణలో తాత్సారం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!
- అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు
- మూడు నెలలు గడుస్తున్నా తయారు కాని నివేదికలు

ములుగు, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): జిల్లాలో పత్తి కొనుగోలు, వ్యవసాయ పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జరుగుతున్న విచారణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ములుగు వ్యవసాయ మార్కెట్‌లో 2019-20 నుంచి 2024-25 వరకు సీసీఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు పండించిన దానికంటే అదనంగా పత్తిని కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారనే విమర్శలు వచ్చాయి. దళారుల నుంచి మార్కెట్‌కు వచ్చిన పత్తికి రూ. 200 నుంచి రూ.300 వరకు తీసుకొని కొనుగోలు చేశారని తెలుస్తోంది. కొనుగోళ్ల సమయంలో జిన్నింగ్ మిల్లుల వద్ద నుంచి క్వింటాకు రూ. 25 చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించి రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధగా మార్కెట్‌కు రావాల్సిన వ్యవసాయ పరికరాల విషయంలోనూ అవకతవకలు జరిగాయనే విమర్శలు వచ్చాయి. వ్యవసాయ మార్కెట్‌కు కావాల్సిన పరికరాల కొనుగోళ్లలోనూ అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ అంశాలను కలెక్టర్ దివాకర సీరియస్‌గా తీసుకున్నారు. ఆర్డీవో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డిపో మేనేజర్ రాంపతితో టుమెన్ కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. అయితే.. మూడు నెలలకు గడుస్తున్నా అక్రమార్కులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల అనుమానాలకు తావిస్తోంది.

2019 నుంచి సీసీఐ కొనుగోళ్లు ఇలా...

రైతులు పండించిన పత్తికి ప్రైవేటు వ్యాపారుల ధర అనుకున్నంతగా లేనిపక్షంలో ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోళ్లను చేపడుతుంది. ఈ నేపథ్యంలోనే ములుగు జిల్లాలో 2019-20లో 9,489 మంది రైతుల వద్ద నుంచి 2,22,974.65 క్వింటాళ్ల పత్తి, 2020-21లో 5,659 మంది రైతుల వద్ద నుంచి 1,36,781.15 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 2021-22, 2022-23 లో ప్రైవేటు ధర రైతులకు అనుకూలంగా ఉండడంతో సీసీఐ కొనుగోళ్లను నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో 2023-24లో ప్రైవేటు ధర తగ్గడంతో సీసీఐ తిరిగి కొనుగోళ్లను చేపట్టింది. ఆ ఏడాది 5,577 మంది రైతుల వద్ద నుంచి 1,76,128.10 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని వెల్లడించింది. అలాగే 2024-25లో 8,574 మంది రైతుల నుంచి 2,33,126.45 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే.. పత్తి కొనుగోళ్ల వ్యవహారంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణలు జిల్లా వ్యాప్తంగా వస్తున్నాయి. దీంతో విచారణ కమిటీని నియమించి నిజాన్ని నిగ్గుతేల్చాల్సిందిగా కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేశారు. అయితే.. ఎంక్వైరీ అధికారులు కేవలం 2024-25లో సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తి లెక్కల్లో జరిగిన అక్రమాలపై మాత్రమే విచారణ చేపట్టినట్లు సమాచారం. అంతకుముందు చేపట్టిన కొనగోళ్లపై విచారణ ఎందుకు చేయడం లేదనే ప్రశ్నలకు సమాధానం లభించడం లేదు. వరుసగా 2019-20, 2020-21, 2023-24ల లో సీసీఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్ల లెక్కలపై అధికారులు విచారణ చేస్తే పెద్దమొత్తంలో అవినీతి బయట పడే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పరికరాల కొనుగోళ్లలో ఏం జరిగిందంటే...

జిల్లా వ్యవసాయ మార్కెట్‌కు కావాల్సిన టార్పాలీన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, మ్యాశ్చర్‌మిషన్లు, ప్యాడీ క్లీనర్లుతదితర పరి కరాలను కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే.. వాటిని కొనుగోలు చేయకుండానే చేసినట్లు లెక్కల్లో చూపారనే ఆ రోపణలు వచ్చాయి. దీంతో వ్యవసాయ మార్కెట్ అధికారులు కొనుగోలు చేసిన పరి కరాలను చూపాలని ఉన్నతాధికారులు కోరగా పక్క జిల్లాకు పంపామని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అక్ర మాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలకు బలాన్ని చేకూర్చింది. దీంతో ఇద్దరు అధికారులతో కూడిన కమిటీని నియమించి సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేశారు.

సీసీఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లు, వ్యవసాయ మార్కెట్‌కు కావాల్సిన పరికరాల కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలని టుమెన్ కమిటీకి కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేసినా దానిని పెడచెవిన పెట్టారనే విమర్శలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉండగా మూడు నెలలు గడుస్తున్నప్పటికీ తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నెలలు గడుస్తున్నా అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విచారణలో తాత్సారం చేయడంలో మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసులను నిర్వీర్యం చేయడానికే ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మరికొందరి నుంచి వ్యక్తమవుతున్నాయి.

విచారణ కొనసాగుతోంది..

- వెంకటేశ్వర్లు, ములుగు ఆర్డీవో

సీసీఐ కొనుగోళ్లు, వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన పరికరాల కొనుగోలుపై ఇంకా విచారణ కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ అధికారుల దగ్గరి నుంచి ప్రస్తుతం కొన్ని ఫైళ్లను తెప్పించుకున్నాం. ఇంకొన్ని రావాల్సి ఉంది. ప్రస్తుతం పత్తి, వడ్ల కొనుగోలు సీజన్ నడుస్తోంది. మార్కెట్ అధికారులు బిజీగా ఉండటం వల్ల, విచారణ కాస్త ఆలస్యం అవుతుంది. త్వరలోనే ఎంక్వైరీ పూర్తి చేసి రిపోర్టును కలెక్టర్‌కు సమర్పిస్తాం.

సర్పంచ్‌ల బాధ్యత కీలకం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఏకగ్రీవ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు కర్ణాకర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేత్రంలో సర్పంచ్‌ల బాధ్యత కీలకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఇది గొప్ప పదవి అని, ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం తప్ప ఇందులో మరొకటి ఉండొద్దని అభిప్రాయపడ్డారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన సర్పంచ్‌లకు ఎమ్మెల్యేతోపాటు డీసీసీ అధ్యక్షుడు భట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో సన్మాన సభ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరి సంఘీభావంతో ఏకగ్రీవ సర్పంచ్ నిర్ణయం ప్రజాస్వామ్యంలో మంచి సంప్రదాయమని అన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల్లో పారదర్శకంగా పాలనను అందించాలని కోరారు. అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకోవడం శుభపరిణామమన్నారు. ఈ నిర్ణయం గ్రామాభివృద్ధికి ఎంతగానో దోహదం పడుతుందన్నారు. సర్పంచ్‌లు గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు, విద్య, వైద్యం, రహదారులు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత సమర్థంగా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, తిరుపతి, దేవన్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్‌లు వీరే...

మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా (మిగతా 8లో..)

నేడు కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ



తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం భూపాలపల్లి కలెక్టరేట్‌లో మంగళవారం జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ప్రతి ఏడాది డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కలెక్టరేట్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం





ఘటనాస్థలిలో సాంబశివరావు మృతదేహం

సాంబశివరావు (ఫైల్)

వాజేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మండలానికి చెందిన ట్రాలీ వాహనం చెరుకూరు వైపు వెళ్తున్న క్రమంలో వాజేడు మండలంలోని 163వ జాతీయ రహదారిపై గొల్లగూడెం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న గొల్లగూడెం గ్రామానికి చెందిన గొంది సాంబశివరావు(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వాజేడు ఎస్సై జక్కుల సతీష్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

బదిలీలైనా డ్యూటీలు ఇక్కడే..

వివరాలు 8వ పేజీలో...

శరవేగంగా..

- మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- పూర్తయిన పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల నిర్మాణం
- కొనసాగుతున్న సమ్మక్క-సాలరమ్మల గద్దెలు, ప్రాకారం
- సీఎం రానున్న రహదారి పునరుద్ధరణలకు శ్రీకారం



మేడారం దేవస్థానంలో కొనసాగుతున్న పనులు

తాడ్వాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా రాతి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నెల చివరి వరకు పనులు పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజుల నూతన గద్దెల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. సమ్మక్క-సారలమ్మల గద్దెలు, అదే ప్రాంగణంలో గ్రానైట్ పనులు, దేవస్థానం చుట్టూ ప్రాకారం, ఆర్చిగేట్ పనులు కొనసాగుతున్నాయి.



సీఎం వచ్చే దారి పనులను పరిశీలిస్తున్న సీఐ దయాకర్

సీఎం వచ్చే దారి పునరుద్ధరణ

మేడారం మహా జాతరకు ముఖ్యమంత్రి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలోనే జనవరి చివరి వారంలో మేడారంలో జరిగే మహా జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికార లాంఛనాలతో రానున్నట్లు గతంలో మంత్రి సీతక్క వెల్లడించారు. అందుకు గతంలో ఉన్న దారిని మార్చారు. ప్రధాన ద్వారం ద్వారా వెళ్లే విధంగా సీఎం దారిని అధికారులు పునర్నిర్మాణం పనులకు ప్రణాళికలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సర్వే పనులు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గతంలో మాదిరిగా భక్తులు వేచి ఉండకుండా ఈ (మిగతా 8వ పేజీలో..)

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఫణీంద్రరెడ్డి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రాస్‌రూట్ స్థాయిలో జరిగే ఎన్నికలని, వీటిని నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్లు) పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సోమవారం సమావేశమయ్యారు. పోలింగ్ విధులు, ఓట్ల లెక్కింపు విధానాలపై మాట్లా డారు. ఫ్రీఅండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు విధులు అత్యంత ముఖ్యమైనవని తెలిపా రు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రతి చర్యనూ నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఏవైనా అనుమా నాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. 28 అంశాలతో కూ డిన నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్నికల వ్యయ పరిశీలకుడు రవి, డీపీవో శ్రీలత, ఎల్‌డీఎం తిరుపతి, డీఈవో రాజేందర్, మాస్టర్ ట్రైనర్లు రామయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను గౌరవించాలి

- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

కృష్ణకాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులను పోలీసులు గౌరవించాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ మండలాలకు చెందిన ఆరుగురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు భరోసా ఇచ్చేలా పోలీసులు విధులు నిర్వర్తించాలన్నారు. వివిధ సమస్యల నిమిత్తం ఠాణాకు వచ్చే వారికి న్యాయం చేయాలన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

భద్రతకు అధిక ప్రాధాన్యం

- సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



భద్రత పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకే సింగరేణి యాజమాన్యం అధిక ప్రాధాన్యమిస్తోందని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని 1 ఇన్‌క్లైన్ గనిలో 56వ వార్షిక భద్రత పక్షోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ కార్మికులకు ప్రతి షిఫ్ట్‌లోనూ భద్రతా చర్యలు, మాక్ డ్రిల్స్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, రక్షణ పరికరాల తనిఖీ, ప్రమాదాల విశ్లేషణ వంటి కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొనేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భద్రత కమిటీ కన్వీనర్ శ్రీనాథ్, సభ్యులు ఎస్.లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, సెక్యూరిటీ ఆఫీసర్ అఫ్సర్‌పాషా, జూనియర్ సర్వే ఆఫీసర్ కిరణ్‌కుమార్, వివిధ యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు నిజాయితీగా పని చేయాలని వరంగల్ నగ ర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికా రులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ఇటీవల ఒకే ప్రాంతం నుంచి ఫిర్యా దులు తరుచుగా వస్తున్నాయని సమస్యలు పునరావృతం కాకుండా అధి కారులకు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఇంజనీరింగ్ - 28, హెల్త్, శానిటేషన్ - 12, ప్రా పర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 07, టౌన్‌ప్లానింగ్ - 45, మంచి నీటి సరాఫరా - 03, హార్టికల్చర్ - 01 మొత్తం 96 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సమ్మయ్య, ప్రసన్న రాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మల రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఎస్ఈ సత్యనారాయణ, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, హార్టికల్చర్ అధికారి రమేష్, హెచ్‌వో లక్ష్మారెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులు ఇలా..

- గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ ఎర్రగట్టుగుట్ట నారాయణనగర్ ప్రాంతంలో చాలా దీర్ఘకాలికంగా ఉన్న డ్రైయినేజీ సమస్యను పరిష్కరిం చాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.
- హనుమకొండ యాదవనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైన్ షాపుతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వైన్ షాపును అక్కడ నుంచి తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ ఉర్సు ప్రాంతంలోని రంగలీల మైదానంలో ఓపెన్ జిమ్ పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని రంగలీల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కోరారు.

అడ్డగోలుగా అనుమతులు

ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలకు పర్మిట్‌లు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖలో ప్రైవేటు బడుల అనుమతుల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. జీవో నెం.1 ప్రకారం నిబంధనలు పాటిస్తేనే ఎంఈవో విచారణ అనంతరం సంబంధిత పాఠశాలకు అనుమతులు జారీ చేసేందుకు డీఈ వో సమ్మతిస్తూ రాష్ట్ర విద్యాశాఖకు సిఫారసు చేస్తారు. అయితే జిల్లాలో మాత్రం అలాంటిదేం జరుగడం లేదని తెలుస్తోంది. నిబంధనలను తుం గలో తొక్కుతూ అనుమతులు మంజూరు చేస్తు న్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమను ప్రస న్నం చేసుకుంటే చాలు నిబంధనలు పాటించ కున్నా పర్వాలేదనే స్థితిలో జిల్లా విద్యాశాఖ ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొసైటీ లేకుండానే..

జీవోనెం. 1 ప్రకారం రిజిస్టర్డ్ సొసైటీ ఉండి నిబంధనలు పాటిస్తేనే ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు మంజూరు చేస్తారు. అయితే వరం గల్ జిల్లా విద్యాశాఖాధికారి మాత్రం సొసైటీ లేకుండానే ఓ ప్రైవేటు పాఠశాలకు అనుమతులు మంజూరు చేశారు. చెన్నారావుపేట మండలంలో కంపెనీ యాక్టుతో ఉన్న ఓ సర్టిఫికెట్ ఆధారంగా అనుమతులు మంజూరు చేశారు. సొసైటీతో పాటు ఇంకా పలు నిబంధనలు పాటించకుండానే ఆ పాఠశాలకు అనుమతులు మంజూరు చేశారు. అలాగే హంటర్‌రోడ్‌లోని ఓ కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలకు సైతం నిబంధనలు ఉల్లంఘిస్తూ అ నుమతులు జారీ చేసినట్లు తెలుస్తోంది. రాయ పర్తి మండంలోనూ ఇలాంటి పద్ధతిలోనే అనుమ తులు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా వుండగా, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ప్రతీ పనికి ఓ బ్రోకరే ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గంపగుత్తగా ప్రైవేటు స్కూల్ ఫైల్ మాట్లాడుకుని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డబ్బులు పంపిణీ చేసి అనుమతులు మంజూరు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

గుడుంబా స్థావరాలపై దాడులు

మరిపెడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లబెల్లం విక్రయిం చినా, గుడంబా తయారు చేసినా, వారిపై కఠిన చర్యలుంటాయని మరిపెడ ఎస్సై వీరభద్రరావు హెచ్చరించారు. సోమవారం మండలంలో ని బీచ్‌రాజ్‌పల్లి శివారు జర్పుల తండాలో గుడంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. గుడంబా స్థావరాలపై దాడులు నిర్వహించి బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారుచేసిన జర్పుల రవి, జర్పుల బాబు, బారోతు ఈర్య, జర్పుల సక్రి, జర్పుల ప్రశాంత్, జర్పుల నాగమ్మలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారథి లేకుండానే 'గులాబీ' పోరు

సందిగ్ధంలో పార్టీ క్యాడర్
బాధ్యతలన్నీ నియోజకవర్గ ఇన్‌చార్జిలపైనే...

మట్టెవాడ(వరంగల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలం పాటు వరంగల్ జిల్లాలో ఏ ఎన్నిక జరిగినా విజయం సాధించిన బీఆర్ ఎస్ పార్టీ ప్రస్తుతం భిన్న పరిస్థితిని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికా రాన్ని కోల్పోవడం, అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా నుంచి ఒక్క ఎమ్మెల్యేనే గెల వడం, లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాల్లో ఓడిపోవడం.. ఇవన్నీ రెండేళ్లుగా పార్టీ క్యాడర్‌ను నిరాశ పరుస్తున్నాయి. నాయకత్వం లేకపోవడం.. పార్టీ సంస్థాగత నిర్మాణంపై అధిష్ఠానం దృష్టి సారించక పోవడం.. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయపరిచే జిల్లా అధ్య క్షుడి స్థానం 20 నెలలుగా భర్తీ చేయకపోవడం.. పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు బీఆర్ ఎస్ పార్టీకి సవాల్‌గా నిలిచాయి.

గత పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో 340 గ్రామ పంచాయతీలలో 270కి పైగా గులాబీ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. అయి తే గత పంచాయతీ ఎన్నికల మాదిరిగా ఇప్పుడు ఎన్నికల్లో గెలుపు అం త సులభం కాదని బీఆర్ఎస్ నేతల్లో, కార్యకర్తల్లో చర్చ సాగుతోంది. పార్టీకి జిల్లా అధ్యక్షుడు లేకపోవడంతో ఎవరికి నచ్చిన విధంగా వారు నడుచుకుంటున్నారు. దాంతోపాటు సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటు చేయకపో వడం.. అనుబంధ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడుతున్నారు. అంతేగాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ ప్రజాప్రతినిధులను, ఉద్యమకారులను సమన్వ యం చేయకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీంతోపాటు రెండు సంవత్సరాలుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడటం కూడా మరింత ఇబ్బంది కలిగిస్తోంది.

నర్సంపేట నియోజకవర్గంలో ఆరు మండలాల పరిధిలో 171 గ్రామా లలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇక్కడ పట్టు సాధించేందుకు బీఆర్ఎ స్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మెజారిటీ గ్రామ పంచాయతీలలో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో 50, రాయపర్తి మండలంలో 38 గ్రామపంచాయతీలలో బీఆర్ఎస్ బలర్చిన అభ్యర్థు లను గెలిపించుకునేందుకు మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు.

పరకాల నియోజకవర్గ పరిధిలోని సంగెం, గీసుగొండ మండలాల్లో 52 గ్రామ పంచాయతీల్లో బీ ఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పరకా ల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

సాయి ఈశ్వరాచారిది ప్రభుత్వ హత్యే

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

సుబేదారి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆత్మ బలిదానానికి పాల్ప డిన సా యి ఈశ్వరాచారి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, అతడి కుటుం బానికి రూ. ఒక కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మ బలిదానానికి పాల్పడిన సాయి ఈశ్వరా చారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం రాత్రి హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీ, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రో జు భిక్షపతి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కామారెడ్డి డిక్ల రేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు.

సాయి ఈశ్వరాచారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయా లని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్ర మంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర సెక్రటరీ కలకోట శ్రీధర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, కురిమిల్ల రమేశ్, టీ డీపీ రాష్ట్ర నాయకుడు చెన్నోజు రఘుబాబు, రాష్ట్ర, జిల్లా నాయకులు బాలాజీ భద్రయ్య, మల్యాల లింగమూర్తి, కె.ఏకాంతం, ఎం.వీరాచారి, ఎన్.మురళి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఎస్.విద్యాసాగర్, ఎస్.రాజ్‌కుమార్, పూర్ణచందర్‌రావు, బాలాజీ కిషన్, పంచకోటి సాంబమూర్తి పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్

పెరిక కులస్థుల అభివృద్ధికి కృషి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్
వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేష్ వర్మ

గిర్మాజిపేట(వరంగల్), డిసెంబరు 8 (ఆం ధ్రజ్యోతి): నగరంలోని ఎంకె నాయుడు కన్వె న్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన తెలం గాణ పెరిక కుల సంఘం సర్వసభ్య సమావే శం లో పెరిక కులం వెబ్‌సైట్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పెరిక కులస్థుల అభివృద్ధి కోసం శక్తి వం చన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోకా పేటలో రెండెకరాల స్థలంలో తెలంగాణ పెరిక కుల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు.

బాలికల కోసం ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రత్యేక వసతి గృహం నిర్మిస్తున్నామని, అదేవి ధంగా పెరిక కుల పరపతి సంఘం ఆధ్వర్యం లో నాలుగు కోట్ల రుపాయల టర్నోవర్‌తో ఆర్థిక సహాయ కార్యక్రమాలు, పెరిక సంక్షేమ సమితిద్వారా కోటి రుపాయల నిధితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విజయ్‌కు మార్ వివరించారు. అదేవిధంగా 35 అను బంధ సంఘాల ద్వారా ప్రతీ పెరిక బిడ్డ అలా నా పాలానా చూసే కార్యక్రమం ప్రారంభిం చామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మద్దా లింగయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ దయానంద్, చింతం సదా నందం, అల్లం నాగరాజు, బరుపాటి గోపి, బెడి ద వీరన్న, నలివెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం తెలంగాణ పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేష్ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్య క్షుడు గటిక విజయ్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా పెరిక కుల నాయ కులు రాజేష్ వర్మను అభినందించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

విద్యార్థుల వికాసాన్ని పెంపొందించాలి: కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్టూడెంట్ వెల్‌నెస్ కార్యక్ర మంపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థుల్లో మానసిక వికాసం, ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే అంశాలను చర్చించారు. అనంత రం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని, ఆహార శైలి, అలవాట్లు, సురక్షిత వాతావరణం కల్పించాల న్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీటీడీఓ ప్రేమకళ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ నిర్మల, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్, గుఉకులాల విద్యాలయాల డీసీఓలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీ అయినా డ్యూటీలు మాత్రం ఇక్కడే

- మరో జిల్లాకు వెళ్లిన ఉద్యోగులకు విధులు
- పంచాయతీ ఎలక్షన్లలో వింత పోకడ
- అయోమయంలో ఎన్నికల సిబ్బంది
- రేపే మొదటి విడత ఎన్నికలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. భూపాలపల్లి జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన ఉద్యోగులకు సైతం ఎన్నికల విధులు కేటాయించడం చర్చనీయాంశమైంది. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఎప్పుడూ లేని విధంగా ఇలా డ్యూటీలు వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వివిధ మండలాల్లో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో వివిధ శాఖల ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకు న్నారు. ఇప్పటికే వివిధ శాఖల నుంచి ద్వితీయ శ్రేణి అధికారుల నుంచి సిబ్బంది వరకు విధులు వేశారు. అయితే.. ఏడాదిన్నర క్రితం ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన డీఆర్‌డీఏ అధికారికి ఎన్నికల విధులు కేటాయించడం, ఆయ నతోపాటు పలువురికి కూడా ఈ డ్యూటీలు వేయడంపై తీవ్ర చర్చకు దారి తీసింది. ఇలా పలు శాఖల్లో కూడా ఇదే తంతు జరగడంతో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చనే ఆరోపణలు వస్తున్నాయి.

అయితే.. వారం రోజుల క్రితం భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వివరాలు సేకరించాల్సి ఉండగా అలాంటి అప్‌డేట్ ఏమీ తీసుకోకుండా పాత లిస్టు ఆధారంగా ఎన్నికల విధులు కేటాయించడం గందరగోళం సృష్టించింది. ఈ తప్పిదాన్ని సరిచేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. బుధవారం మొదటి విడత ఎన్నికలు జరుగనుండటంతో ఇప్పటికిప్పుడు మార్చడమెలా? అని తలలుపట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ములుగు నుంచి భూపాలపల్లికి బదిలీపై వచ్చిన వారికి సైతం ములుగులో విధులు కేటా యించడం కూడా చర్చకు దారి తీసింది.

డిజిగ్నేషన్ల వారీగా అప్పగించని విధులు

డిజిగ్నేషన్ల వారీగా విధులు అప్పగించడంలో అధికారులు పూర్తిగా విఫల మయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ద్వితీయశ్రేణి అధికారులకు పర్యవేక్షణ అధికారులుగా నియమించాల్సి ఉండగా అంతకంటే కింది స్థాయి విధులు కేటాయించారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. పేర్లు ఒకరివి, సెల్‌ఫోన్ నెంబర్లు మరొకరివి, అలాగే పేర్లు ఒకరివి.. డిజిగ్నేషన్లు మరొకరివి కూడా ఉన్నాయని పలువురు సిబ్బంది తెలిపారు. జూనియర్లకు, సీనియర్లకు తేడా లేకుండా విధులు వేశారని ఆరోపిస్తున్నారు.

పారా త్రోబాల్‌లో పలిమెల వాసికి గోల్డ్ మెడల్



బంగారు పతకం అందుకుంటున్న జ్యోతి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా పలి మెల మండల కేంద్రా నికి చెందిన కావేరి జ్యోతి పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభను చాటి బంగారు పత కాన్ని సాధించింది. ఈనెల 6,7వ తేదీల్లో శ్రీలంక పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆ దేశంలోని రత్నపుర నగరంలో నిర్వహించిన సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ ఎల్‌లో ఆమె పాల్గొంది. ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి బంగారు పతకాన్ని సాధించింది. ఇదే కాకుండా ఇప్పటి వరకు మూడు అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న జ్యోతి అత్యంత ప్రతిభను చాటింది. త్రోబాల్‌తో పాటు షాట్‌పుట్, జావెలిన్‌త్రో ఆటల్లో సైతం రాష్ట్ర స్థాయిలో ఆమె రాణిస్తోంది. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో ఆమె బంగారు పతకాన్ని సాధించిడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమానికి సర్కారు పెద్దపీట

- **టీపీసీసీ ఉపాధ్యక్షుడు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి**

పెద్దవంగర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమానికి సర్కారు పెద్దపీట వేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం తో పాటు ఉప్పరగూడెం, అవుతాపురం, పోచంపల్లి, గంట్లకుంట, కాన్వాయిగూడెం, కొరి పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నా మని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అంది స్తామని తెలిపారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దు కుందామన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నేరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజే యాలన్నారు. ప్రభుత్వం అండతోనే గ్రామాల సంపూర్ణాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభి వృద్ధిని దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేయాల న్నారు. మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు ముద్దసాని సురే ష్, విజయ్‌పాల్‌రెడ్డి, నెహ్రూనాయక్, రంగు మురళి, మధన్‌మోహన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, పాషా, వెంకన్న, సోమన్న, వేణు, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

తొర్రూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించా లని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా క్లస్టర్ అధికారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని, ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై చర్యలుంటాయన్నారు. ఆర్‌వోలు, పీవోలు, రూట్ ఆఫీస ర్లు వారికి కేటాయించిన రూట్‌లలో ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని, సంబంధిత రూట్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం ముగుస్తుందని, తర్వాత ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో బుచ్చయ్య, ఎంపీవో పూర్ణచందర్, నిశాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి బోనాల జాతర



బోనాలతో ఆలయం చుట్టూ తిరుగుతున్న భక్తులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదే వపూర్ మండలంలోని బెగ్లూర్‌లో మల్లికా ర్జున స్వామి బోనాల జాతర సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శివస త్తుల పూనకాలు, మల్లికార్జున స్వామి నామ స్మరణతో పరిసరాలన్నీ మార్మోగాయి. మండల గ్రామాల నుంచే కాకుండా మహా రాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఆలయం చూట్టూ ప్రదక్షిణలు చేసిన భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పించుకున్నారు. భక్తుల భారీ సంఖ్యలో తరలిరావడంతో ఎస్సైలు పవన్ కుమార్, సాయి శశాంక్ ఆధ్వర్యంలో పోలీ సులు బందోబస్తును ఏర్పాటు చేశారు. బోనాల సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్య దర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, శైలజ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గంపగుత్త ఓట్ల కోసం వేలం?

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో జనరల్ మహిళకు రిజర్వ్ అయిన గ్రామపంచాయతీలో సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తున్న కొందరు అధికంగా ఉన్న ఓ సామాజిక వర్గం ఓట్లను గంపగుత్తగా వేసుకోవడానికి వేలం పాడినట్లు తెలుస్తోంది. ఐపీ పరిధిలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ముగ్గురు, నలుగురు అభ్యర్థులు ఓటర్ల వద్దకు వెళ్లి మాట్లాడినట్లు సమా చారం. ఈ క్రమంలో వేలం పాట పాడినట్లు తెలి సింది. ఎవరు ఎక్కువగా డబ్బులు ఇస్తామంటే వారికే ఓట్లు వేయాలని చెప్పి ఈ తతంగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం.

వేలంలో ఓ అభ్యర్థి ఆ సామాజికవర్గం ఓట్లను రూ.7 లక్షల 83వేలకు పాడినట్లు తెలిసింది. అయితే.. గెలవడానికి ఈ ఓట్లు మాత్రమే సరిపోవని భావించిన ఆ అభ్యర్థి తరపువారు వేరే సామాజికర్గాన్ని సంప్రదిం చారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ జీపీలోనే కాకుండా కొన్ని ఇతర జీపీల పరిధిలోనూ ఓట్ల కోసం వేలం పాడుతున్నారని తెలిసింది. డబ్బులు ఉన్నవారే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు దక్కించుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రాజకీయ నాయకుల బైండోవర్

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచా యతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు, ఘర్షణ లకు తావులేకుండా భూపాలపల్లి జిల్లా కాటారం మండ లంలోని పలు పార్టీలకు చెందిన పలువురు నాయకు లను తహసీల్దార్ నాగరాజు ఎదుట సోమవారం బైండో వర్ చేసినట్లు ఎస్సై ఆకుల శ్రీనివాస్ తెలిపారు. బైండో వర్ అయిన వారిలో బీఆర్ఎస్, బీజేపీకు చెందిన ఏడు గురు ఉన్నారని పేర్కొన్నారు. మిగతా పార్టీల వారిని కూడా బైండోవర్ చేస్తామని వెల్లడించారు.



ఊరు-పోరు
VOORU - PORU

ప్రచారంపై పటిష్ఠ నిఘా

- పరిశీలన కోసం ప్రత్యేక బృందాల కేటాయింపు
- మద్యం, కానుకల పంపిణీపై దృష్టి
- ఎప్పటికప్పుడు వీడియోల చిత్రీకరణ

వర్ధన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. అయితే ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. కలెక్టర్లు, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రచార ఘట్టాలకు సంబంధించి మండలానికో ప్రత్యేక పరిశీలకుడిని నియమించారు.

అతడి పర్యవేక్షణలో బృందం సభ్యులు ప్రచార తీరు తెన్నులతో పాటు అభ్యర్థులు చేసే ఖర్చుపై దృష్టి పెడుతున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా వీడియోలు చిత్రీకరిస్తున్నారు. ఇందుకోసం మండలానికి ఇద్దరు చొప్పున సూక్ష్మ పరిశీలకులను నియమిస్తున్నారు. ఇప్పటికే 5-10 పంచాయతీలకు ఒక జోనల్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. ప్రతీ 200ల మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారిని నియమిస్తున్నారు. 400 ఓట్లు పైబడిన గ్రామాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ బూత్ తప్పనిసరిగా ఉంటుంది. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలపైన పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఉద్యోగులు ప్రచారం జోలికెళ్లొద్దు..

గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఉపాధిహామీ, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, ఐకేపీ, ఆరోగ్యశ్రీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సీఆర్పీలు, రిసోర్స్‌పర్సన్‌లు, ప్రభుత్వ శాఖలో ఒప్పంద పద్ధతి న పని చేసే వారందరికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుంది. వీరు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన. వీరు ఓటు హక్కును సాధారణ ఓటరు మాదిరిగా వినియోగించుకోవచ్చు.

ప్రధానంగా దృష్టి పెట్టే అంశాలు..

ప్రచారంలో డబ్బులు, మద్యం పంపిణీపై నిత్యం నిఘా ఉంటుంది. చీరల పంపిణీ, సంఘాలకు నజరానాలను ప్రకటించడం, యువతకు కానుకల పంపిణీపై దృష్టి పెడతారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను గమనిస్తారు. అనుమతి లేకుండా స్పీకర్ల వాడకంపై కన్నేస్తారు. నిర్ణీత సమయానికి ప్రచారాన్ని ఆపకపోతే చర్యలుంటాయి. ఎన్నికల కరపత్రాలు, ముద్రణ, ప్రచురణ, అభ్యర్థుల ఖర్చుపైన దృష్టి సారిస్తారు.

డిపాజిట్ దక్కాలంటే..

వర్ధన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యో తి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం జనరల్ సర్పంచ్ అభ్యర్థులు అయితే రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వారైతే రూ.1వేయి, వార్డు సభ్యుల విషయానికొస్తే జనరల్ అభ్యర్థులు రూ.500, ఇతరులు రూ.250 జమ చేయాలి. అయితే వారిలో కొందరు డిపాజిట్లు కోల్పోతారు. అదెలాగంటే.. పోలైన ఓట్లలో 16 శాతానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థికి డిపాజిట్ దక్కుతుంది. అంటే ఉదాహరణకు ఒక వెయ్యి ఓట్లు పోలైతే ఎవరికైతే 160కి పైగా ఓట్లు పడతాయో వారికి ధరావత్ లభిస్తుంది. ఇంతకన్నా తక్కువ ఓట్లు వస్తే వారు డిపాజిట్ కోల్పోయినట్లు లెక్క. దీని అర్థం వీరి ఓటమి గౌరవ ప్రదమైనది కాదని భావించాలి. వీరికి జమ చేసిన ధరావత్ సొమ్ము తిరిగి ఇవ్వరు. ఈ డబ్బులు ఎన్నికల కమిషన్ ఖాతాల్లోకి వెళ్తాయి. అదే డిపాజిట్ సాధించిన వారికి జమ చేసిన డబ్బులను తిరిగి అందజేస్తారు.



ఏటూరునాగారంలో హోరాహోరీ

సర్పంచ్ పదవి కైవసానికి ప్రధాన పార్టీల వ్యూహాలు



ఏటూరునాగారం గ్రామ పంచాయతీ భవనం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగనుంది. ఇక్కడ సర్పంచ్ స్థానం మహిళ(జనరల్)కు రిజర్వు కావడంతో పోరు ఆసక్తిగా మారింది. ప్రధాన పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఈ పంచాయతీ ప్రతిష్ఠాత్మకం కావడంతో అన్ని అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. గుండ్ల శ్రీలత (కాంగ్రెస్), కాకులమర్రి శ్రీలత (బీఆర్ఎస్), వినుగోలు ధనలక్ష్మి (బీజేపీ) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ముగ్గురు అభ్యర్థుల భర్తలు ఆయా పార్టీల్లో క్రియాశీలంగా ఉండటంతో పోటీ రసకందాయంగా మారింది. ఇక్కడ ఈ నెల 11వ తేదీన మొదటి విడతలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

ఏటూరునాగారం పంచాయతీలో మొత్తం 19 వార్డులుండగా, 11,398 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. వీరిలో మహిళలు-6004, పురుషులు-5392, ఇతరులు-2 ఉన్నారు. పోటీలో వున్న ఇద్దరు అభ్యర్థుల భర్తలు రాజకీయంగా బలంగా ఉండడంతో ఎవరు పాగా వేస్తారోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఇక వీరిద్దరికీ తామేమీ తక్కువ కాదంటూ జాతీయ పార్టీ అయిన బీజేపీ మద్దతు పలికిన అభ్యర్థి ప్రచారం సాగిస్తున్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. మంత్రి సీతక్క స్వయంగా రంగంలోకి దిగి అభివృద్ధి మంత్రాన్ని తెరపైకి తెచ్చి గెలిపించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని ఓడించి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని మరొక సారి నిరూపించుకోవాలని చూస్తోంది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ పార్టీ సైతం మేజర్ పంచాయతీకి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది. జిల్లా క్యాడరంతా ఏకతాటిపైకి వచ్చి గెలుపుపై ప్రధానంగా దృషి పెట్టింది. సర్పంచుగా గెలిచి జిల్లాలో ఉనికిని చాటేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి సైతం నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని గెలుపే లక్ష్యమంటూ ప్రకటించారు. ఈ రెండు పార్టీలకు బీజేపీ తక్కువ కాదని, మేజర్‌లో గెలిచి తీరుతామని బీజేపీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లది కీలకపాత్ర

ఎన్నికల పరిశీలకురాలు బాల మాయాదేవి



మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న బాల మాయాదేవి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్లు) పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సోమవారం డీఆర్డీఏ కార్యాలయంలో మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల శిక్షణ తరగతులను వారు సందర్శించి మాట్లాడారు. సాధారణ పరిశీలకులు కూడా మైక్రో అబ్జర్వర్లు అందించే నివేదికల ఆధారంగానే ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారని పేర్కొన్నారు. పోలింగ్ రోజున సూక్ష్మ పరిశీలకులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకొని పోలింగ్ ప్రక్రియలోని ప్రతీ అంశం నిబంధనల ప్రకారం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నికల కార్యక్రమాలను ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారమే జరిగేలా చూడాలన్నారు. ఇందు కు సంబంధించిన రిపోర్టులను సకాలంలో సాధారణ పరిశీలకులకు అందించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమి స్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మూడు విడతల్లో జరిగే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకంగా విధులను నిర్వహించి, నివేదికలను జిల్లా పరిశీలకులకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పరిశ్రమశాఖ జనరల్ మేనేజర్ నరసింహామూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లపై అధికారులతో ఆర్ఎం సమీక్ష



ములుగు జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ సుధీర్ కేకన్, ములుగు జిల్లా ఎస్పీ రాంనాథ్‌తో సమా వేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. మేడారం జాతరకు సంబంధించి ఆర్టీసీ బస్సు సర్వీసుల ఏర్పాట్లపై, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఇతర శాఖల నుంచి ఆర్టీసీ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆర్ఎం తెలిపారు.

లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



ఇందిరమ్మ ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, బల్దియా కమిషనర్ చహత్

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం ఆవాస్ యోజన పథకం లబ్ధిదారుల వివరాలను గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పైడిపల్లి, దేశాయిపేట, తిమ్మాపూర్, దూపకుంట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల ఇళ్లను బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాల్లో నీటి సరఫరా, విద్యుత్తు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఉండేలా చూడాలన్నారు. పీఎంఎవై పోర్టల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వివరాలను కచ్చితమైన పారామీటర్ల ప్రకారం సంబంధిత శాఖలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో బల్దియా సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఆర్డీవో సుమ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈఈలు సంతోష్ బాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బాక్సింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 100 మంది బాక్సర్ల హాజరు



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర బాక్సింగ్ ఎంపిక పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. సోమవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలను తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (టీజీపేట) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోవి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడల్లో రాణించాలంటే కఠోర సాధనతో పాటు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ... ఒక్క రోజు పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో సుమారు 100 మంది బాక్సర్లు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాక్సర్లను డిసెంబరు మూడో వారంలో హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో (జయశంకర్ భూపాలపల్లి) సీహెచ్. రఘు, యూపీఎస్ హెచ్ఎం శోభారాణి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామిచరణ్, బాక్సింగ్ అసోసియేషన్ బాధ్యులు పెద్దమ్మల నర్సింహారాములు, పీఈటీలు పార్థసారథి, శ్రీధర్‌రావు, కోచ్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో వైభవంగా పల్లివేట

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, బీజేపీ నాయకులు

నర్సంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అయ్యప్ప పల్లివేట వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో సోమవారం క్షేత్రబలి, పల్లివేట కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయసేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరి కొండ మాధవశంకర్, ఆలయ అధ్యక్షుడు పైసా సురేశ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన తాంత్రికవేత్త శంకరన్ నంబూద్రి ఘనంగా పూజలు నిర్వహించారు.

పల్లివేట దాత గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి తల్లి చనిపోయి సంవత్సరీకం పూర్తికాక పోవడంతో ఆయన సూచన మేరకు బీజేపీ నాయకుడు అచ్చ దయాకర్ దంపతులచే ఆలయం ఆవరణలో ఉత్సవబలి, క్షేత్రబలి, బలిపీఠాలకు వివిధ రకాల నైవేద్య పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి మొదట పల్లకిలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, ఆలయ చైర్మన్ పైసా సురేశ్ కమిటీ సభ్యులు మోసుకువచ్చారు. అనంతరం అచ్చ దయాకర్ నెత్తిన స్వామి విగ్రహాన్ని తీసుకొచ్చి అలంకరించిన ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాల నడుమ స్వామి శోభాయాత్ర ఊరేగింపు ఆలయం నుంచి మునిసిపల్ కార్యాలయం ఆవరణ వరకు నిర్వహించారు.

ఆకట్టుకున్న ఉత్సవం

నర్సంపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగావనం (కుటీరం)లో సోమవారం నిర్వహించిన పల్లివేట వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అచ్చ దయాకర్ దంపతులచే అభిషేక పూజలతో పాటు పుష్పాభిషేక పూజలు చేసిన అనంతరం అష్టోత్తర పూజలు చేసి హారతి ఇవ్వడంతో పల్లివేట ఉత్సవం ముగిసింది. అనంతరం అయ్యప్ప ఆలయంలో మాలధారులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అయ్యప్పకు పూజలు చేస్తున్న తాంత్రికవేత్త నంబూద్రి

నేటి నుంచి నోబెల్ ప్రైజ్ డే సంబరాలు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు దోహదం



కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పరిశోధన, సైన్స్ సబ్జెక్టులపై ఆసక్తి పెంచేందుకు కాకతీయ వర్సిటీలోని విద్యార్థులకు కేయూ స్టూడెంట్స్ ఆఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో వివిధ విభాగాల సహకారంతో రెండు రోజుల పాటు నోబెల్ ప్రైజ్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కేయూ స్వర్ణోత్సవాల సందర్భంగా డిసెంబరు 9, 10 తేదీల్లో ఉత్సవాలను ఏర్పాటు చేశారు.

విభాగాల వారీగా..

9న ఉదయం రసాయనశాస్త్రం విద్యార్థులకు శాస్త్రం, సమాజాన్ని మార్చిన నోబెల్ రసాయన ఆవిష్కరణ, అనే అంశంపై, అలాగే భౌతిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ భౌతిక ఆవిష్కరణలు ఆధునిక ప్రపంచాన్ని ఎలా ఆకృతీకరించాయి. అనే అంశంపై అలాగే లైఫ్ సైన్స్, ఫార్మసీ విద్యార్థులకు నోబెల్ ఆవిష్కరణలు మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోపడుతాయి. అనే అంశంపై, ఆర్థిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ ఆర్థిక శాస్త్ర విజేతలు సమాజాలను ఎలా మార్చారు. అనే అంశంపై ఇంగ్లిష్ విభాగం విద్యార్థులకు సాహిత్యంలో 'నోబెల్ విజేతలు- ప్రపంచాన్ని మార్చిన స్వరాలు' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు జరుగుతాయి.

రేపు సెమినార్లు

డిసెంబరు 10న నోబెల్ బహుమతి సాధించిన పరిశోధన అంశంపై విషయ నిపుణులతో సెమినార్లు ఏర్పాటు చేశారు. శాతవాహన వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, బిట్స్ పిలానీ నుంచి ప్రొఫెసర్ తనై నాగ్, తెలంగాణ వర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్, నిట్ వరంగల్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథ్‌లు హాజరై 2025లో నోబుల్ బహుమతి పొందిన వివిధ అంశాలపై ప్రసంగిస్తారు. 10న కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ, రిజిస్ట్రార్లు నోబెల్ ప్రైజ్ డే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నారు.

వివిధ అంశాలపై పోటీలు

రెండు రోజుల పాటు జరిగే నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా మొదటిరోజు (మంగళవా రం) ఉదయం 10 గంటల నుంచి వివిధ విభాగాల్లో ఆయా విభాగాల విద్యార్థులకు పోస్టర్ ప్రజేంటేషన్, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు. పోస్టర్ ప్రజేంటేషన్, వ్యకృత్వ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని విభాగాల నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

బాలికల భద్రతపై కేంద్రం ఏం చేస్తోంది ?

లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

హనుమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బాలికల భద్రత విషయంలో ఏం చేస్తోందంటూ వరంగల్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో ధ్వజమెత్తారు. తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ చదువుతున్న ఒడిశాకు చెందిన బీఈడీ దళిత విద్యార్థినిని వేధింపులకు గురి చేయడంతో ఆమె చదువు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ విషయాన్ని ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ లేవనెత్తారు. బేటీ పడావో అన్న నినాదం పాఠశాల గోడలకే పరిమితమా ? విద్యాలయాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యువతులకు రక్షణ ఎక్కడా? అని ప్రశ్నించారు. విద్యా సంస్థల్లో మహిళల భద్రతను కాపాడే వ్యవస్థలు ఎంత వరకు పని చేస్తున్నాయో తెలియజేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు. దీంతో కావ్యతో పాటు పలువురు జవాబు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సభలో నిరసన వ్యక్తం చేశారు. దళిత మహిళా స్కాలర్‌పై జరిగిన ఘటనకు సంబంధించి ప్రభుత్వం స్పందించాలని, మహిళా విద్యార్థుల భద్ర తకు బలమైన వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

అవినీతిపై పోరాట జ్వాల

- లంచగొండులపై యుద్ధం చేస్తున్న సంస్థ
- 20 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు
- ప్రజలకు వినూత్నంగా అవగాహన
- నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం



అవినీతి శవయాత్ర నిర్వహిస్తున్న జ్వాల సంస్థ నిర్వాహకులు (ఫైల్)

పోచమ్మమైదాన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అవినీతిపై 20 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తోంది 'జ్వాల' అనే అవినీతి వ్యతిరేక సంస్థ. లంచగొండి అధికారుల భరతం పడుతూ.. ప్రభుత్వ సంస్థల్లో అవినీతిని నిర్మూలించేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా అవినీతి అధికారులను పట్టించిన వారికి అండగా నిలబడుతోంది.

వరంగల్ జిల్లా అరెపల్లి ప్రాంతానికి చెందిన సుంకరి ప్రశాంత్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి వినూత్న కార్యక్రమాలతో పోరాటం సాగిస్తున్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా 2004 డిసెంబరు 9న జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి అవినీతిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంచగొండి అధికారులను పట్టించిన వారికి నగదు బహుమతులు, ప్రోత్సహకాలు అందిస్తూ.... ఉత్తమ అధికారులను సన్మానిస్తూ అవినీతి నిరోధకానికి కృషి చేస్తున్నారు. లంచం డిమాండ్ చేసే వారిది ఎంత తప్పో... ఇవ్వాలని చూసేవారిది కూడా అంతే తప్పని చెబుతూ ఏటా అవినీతి నిరోధక దినోత్సవం రోజున శవయాత్రలు, భిక్షాటనలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. 'అవినీతి పరుడికి సన్మాన యాత్ర' అంటూ అనేక వినూత్న కార్యక్రమాలు చేస్తున్నారు. అంతేకాక లంచం తీసుకోబోమని ప్రతిజ్ఞ చేసిన ఉత్తమ ప్రభుత్వ అధికారులను గుర్రాలపై ఊరేగించి అభినందిస్తున్నారు.

నేడు బిచ్చగాళ్లతో ర్యాలీ

అవినీతి నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఆధ్వర్యంలో బిచ్చగాళ్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ తెలిపారు. 'అవినీతి పరులకన్నా... అడుక్కు తినడం మిన్న' అనే నినాదంతో బిచ్చగాళ్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



లంచగొండి ప్రభుత్వ అధికారులపై ఎన్ని దాడులు జరిగినప్పటికీ కొందరి తీరు మారడం లేదు. ప్రతీ పనికో రేటు చొప్పున లంచాలు తీసుకుంటున్నారు. అవినీతి నిరోధక దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. అప్పుడే ప్రజలలో పూర్తి స్థాయిలో అవగాహన కల్గుతుంది. ప్రభుత్వ కార్యాలయాలలో సైతం అవినీతి తగ్గుముఖం పడుతుంది. లంచం అడిగిన వారి పై ఏసీబీకి ఫిర్యాదు చేయాల్సిందే.

- సుంకరి ప్రశాంత్, జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు

నజరానా పొందండి..

లంచగొండి అధికారుల భరతం పట్టేందుకు జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ నిర్వాహకులు 2017 నుంచి 'ఏసీబీకి పట్టించండి... నజరానా పొందండి' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. లంచం తీసుకునే గ్రామస్థాయి అధికారిని పట్టించినందుకు రూ.5 వేలు, మండల స్థాయిలో రూ.10 వేలు, జిల్లాస్థాయిలో రూ.15 వేల నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ స్థాయిల అధికారులను పట్టించిన సుమారు 30 మందికి పైగా నగదు బహుమతులు అందజేశారు.

బీఆర్ఎస్‌ను ఆదరించండి

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

గణపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరారు. మండలంలోని బస్వరాజుపల్లి గ్రామ పంచాయతీలో ఆయన సోమ వారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు గుర్తు చేసి బీఆర్ఎస్ అభ్యర్థుల ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థితోపాటు నాయకులు చెరుకు కుమారస్వామి, మధు, పూర్ణచందర్, జైపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవం వైపు సర్పంచ్ స్థానాలు!

మల్హర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇప్పటికే దుబ్బపేట జీపీ ఏకగ్రీవం వైపు వెళ్లగా మరికొందరు కూడా అదే బాట పట్టనున్నట్లు తెలిసింది. మరో రెండు జీపీల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తాజాగా సోమవారం చిన్నతూండ్ల సర్పంచ్ స్థానం ఏకగ్రీవ మైందని ప్రచారం సాగుతోంది. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం మధ్యాహ్నం వరకు సమయం ఉండటంతో మరో జీపీ సర్పంచ్ స్థానం కూడా ఏకగ్రీవమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో వార్డులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కాగా ఇవి ఏకగ్రీవమైనట్టు అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అభ్యర్థుల ఖర్చులు పరిమితి దాటొద్దు

పంచాయతీ ఎన్నికల పరిశీలకుడు రవికుమార్

చిట్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల సందర్భంగా సర్పంచ్, వార్డుమెంబర్ అభ్యర్థుల ఖర్చు ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించకూడదని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రవికుమార్ సూచించారు. మండలంలోని జూకల్లు శివారు ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎన్నికల అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు, బ్యాంకు ఖాతా ఉపయోగంపై సోమవారం జరిగిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. సర్పంచ్ అభ్యర్థి ఖర్చు రూ.1.50 లక్ష, వార్డు సభ్యుడి ఖర్చు రూ. 30 వేలు మించకూడదని తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన బ్యాంకు ఖాతానే అభ్యర్థులు జమ, ఖర్చుకు వినియోగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, వివిధ శాఖల అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ధర్మరావుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని బస్వరాజుపల్లి, పరుశురాంపల్లి, ధర్మరావుపేట, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు భట్టు కర్ణాకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ప్రతీ గ్రామం అభివృద్ధికి నోచుకుంటోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థులు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న ధాన్యం సేకరణ

ఐరీష్‌తో రైతులకు తప్పని తిప్పలు

మల్హర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు కేంద్రాలు మండలంలోని ప్రారంభించి వారం రోజులు పూర్తికాగా సోమవారం వరకు 112 మంది రైతుల వద్ద నుంచి 7 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇందులో 61 మంది రైతులకు సుమారు రూ. 78 లక్షల వరకు చెల్లించారు. గతంలో మాదిరిగా కాకుడా తాడిచర్లతోపాటు పలు గ్రామాల్లో ధాన్యం సేకరణ వేగంగా సాగుతుండగా కొన్ని గ్రామాల్లో మందకొడిగా ఉంది. ఇప్పటికే ధాన్యం దిగుమతికి మిల్లులు కేటాయించగా కొనుగోళ్లు వేగవంతమయ్యాయి.

ఐరీష్‌తో రైతులకు ఇబ్బందులు

గతంలో మాదిరిగా ఆధార్ ఓటీపీతో కాకుండా వివరాలకు ఐరీష్‌తో తీసుకుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో మాత్రమే ఈ ప్రక్రియ ఇలా కొనసాగుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తూకం తర్వాత రైతులు అకౌంట్లో డబ్బులు జమ కావడానికి ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ధాన్యం తూకం వేయిచంని ప్రతి రైతూ ఐరీష్ ప్రక్రియ ట్యాబ్‌లో పూర్తి చేయాల్సిందేనని అధికారులు అంటున్నారు. తాడిచర్లలోని



లారీలో లోడ్ అవుతున్న ధాన్యం

పీఏసీఎస్ కార్యాలయం లేదా కొయ్యూర్‌లోని సెంటర్‌కు రైతులు ఐరీష్‌కు రావాల్సిందేనని తెలుపుతున్నారు. సిగ్నల్ సక్రమంగా లేకుంటే ఈ ప్రక్రియ ముందుకు సాగదని అంటున్నారు. అధికారులు గతంలో మాదిరిగానే ఆధార్ ఓటీపీతో ప్రక్రియ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

● ఇద్దరు వ్యక్తులు అరెస్టు

కురవి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారినుంచి 1.50 లక్షలు విలువ చేసే 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. కురవి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు కురవి ఎస్సై గండ్రాతి సతీష్, ఎస్సై-2 జయకుమార్ కురవి-ఖమ్మం రహదారిలోని పీహెచ్‌సీ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నెంబర్‌ప్లేట్‌కు నల్ల పెయింట్ వేసి ద్విచక్రవాహనం అటుగా రావడంతో పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. దీంతో వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనం అక్కడే నిలిపి తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద 3 కేజీల గంజాయి లభించింది. వీరిని కరీంనగర్‌కు చెందిన పటేల్ పవన్, మల్యాలకు చెందిన ఓర్సు చందులుగా గుర్తించారు.

వీరిని విచారించగా విశాఖపట్నం నుంచి అరకు వెళ్లి తక్కువ ధరకు 3 కిలోల గంజాయిని తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లు చేసి మహబూబాబాద్‌లో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారని సీఐ చెప్పారు. ద్విచక్రవాహనం సైతం కరీంనగర్‌లో దొంగిలించిన వాహనమేనని వెల్లడించారు. గంజాయి పట్టుకున్న కురవి పోలీసులను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు.

తరుగు పేరుతో దోపిడీని అరికట్టాలి : బీఎస్పీ

టేకుమట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టేకుమట్లతో పాటు మొగుళ్లపల్లి, చిట్యాల, రేగొండ మండలాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమశాతం పేరుతో ఒక్కో బస్తా నుంచి 4-5 కిలోల కోత విధిస్తున్నారని విమర్శించారు. మిల్లర్లతో కుమ్మక్కైన ఐకేపీ నిర్వాహకులు ఈ దందాను కొనసాగి స్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు దీనిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు మాజీ ఎంపీటీసీ రాజీనామా

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ హట్కర్ రూపాదేవి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. రూపాదేవి కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.

డంప్‌యార్డును పరిశీలించిన కమిషనర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జవహర్‌కాలనీకి సమీపంలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న డంప్‌యార్డును మునిసిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులను పిలిచి డంప్‌యార్డు గురించి వివరించారు. ఈ ప్రాంతంలో చెత్తాచెదారం పోయవద్దని తెలిపారు. అలాగే ఇక్కడ చెత్తను తగులబెట్టడం మూలంగా సమీపంలోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంద న్నారు. వెంటనే డంప్‌యార్డును చదును చేయించారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ వలంటర్ల నియామకం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువభారత్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2025 1 అక్టోబరు నాటికి 18 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని ఆరు జిల్లాల నుంచి అన్ని మండలాల్లో వలంటీర్లుగా పనిచేసేందుకు యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎంపికైన వలంటీర్లకు నెలకు రూ.5వేలు స్టయిపెండ్ ఉంటుం దని తెలిపారు. యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుధ్యం, లింగ వివక్షపై అవగాహన తదితర సామాజిక కార్యక్ర మాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేయడంలో భాగస్వా ములు కావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 0870-2958776 నంబరుపై సంప్రదిం చాలని కోరారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం ఆయన మండలంలోని రంగాపురం, పాత ఇస్సిపేట, వేములపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకునే బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరచిపోయిందని, మాటలకే పరిమితం కాని చేతల్లోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలోనే అభివృద్ధి జరిగిందని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రైతులు, సామాన్య ప్రజలకు న్యాయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు కొడారి రమేష్, శ్యాంసుందర్‌రెడ్డి, ఆరెల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాపూర్ బోనాల జాతర

కాటారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్‌లో బోనాల జాతర సోమవారం వైభవంగా జరిగింది. మల్లన్న ఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్ద పట్నాలు వేశారు. అనంతరం శివ సత్తులు, లక్ష్మీదేవరలు డోలువాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య పూనకాలతో భక్తులకు భవిష్యవాణి వినిపించారు. మహిళలు నైవేద్యంతో కూడిన బోనాలను వండి సాయంత్రం ఆలయ ప్రదక్షిణ చేసి మల్లన్నకు సమర్పించారు. పలు గ్రామాల నుంచి జాతరకు వందలాది మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమునూరి రమేష్‌రెడ్డి, జాతరోత్సవాల నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు, శివసత్తులు

సర్పంచ్‌ల బాధ్యత కీలకం

(5వ పేజీ తరువాయి)

రేగొండ, మొగుళ్లపల్లి, కొత్తపల్లిగోరి, గణపురం మండలాల నుంచి వివిధ గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌ల వివరాలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఈ సందర్భంగా వెల్లడించారు. బాలయ్యపల్లికి చెందిన తొట్ల తిరుపతి యాదవ్, ఇజ్జయ్యపల్లికి చెందిన జక్కుల మానస, చెంచుపల్లికి చెందిన జెల్ల రాము, గూడెపల్లికి చెందిన కొలుగూరి రాజేశ్వర్‌రావు, కొత్తపల్లి(బీ) చెందిన భూతం రజిత, రేపాక నుంచి తిరుపతి, బుద్ధారంకు చెందిన విడిదినేని శ్రీలత, గుడిపాడు నుంచి సాంబయ్య, బద్దంపల్లి నుంచి రాంరెడ్డి, వెలిశాల నుంచి బొడ్డు తిరుపతి, పెద్దంపల్లి నుంచి శ్రీలేఖ, ఏలేటిరామయ్యపల్లి నుంచి అశోక్, పాశిగడ్డ తండాకు చెందిన రవీందర్, ముచినిపర్తి నుంచి రాజేందర్, బావుసింగ్‌పల్లి నుంచి రాజేశ్వర్‌రావు, చైన్‌పాక నుంచి మనోహర్, శ్యాంనగర్ నుంచి రజిత, బావుసింగ్‌పల్లి భూపాలపల్లి నుంచి ముత్తమ్మ ఏకగ్రీవమైన సర్పంచ్‌ల జాబితాలో ఉన్నారు. వీరిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు కర్నాకర్ సన్మానించారు.

శరవేగంగా..

(5వ పేజీ తరువాయి)

పనులు చేస్తున్నట్లు పస్రా సీఐ దయాకర్ తెలిపారు. ఇందులో భాగంగా పనులు పరిశీలించి కాంట్రాక్టర్‌కు ఆయన పలు సూచనలు చేశారు.

అందుబాటులోకి రాని దుస్తులు మార్చుకునే గదులు

మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వస్తున్న మహిళా భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఉన్న గదులను అధికారులు అందుబాటులోకి తేవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జంపన్నవాగు ఒడ్డున ఉన్న మహిళలు బట్టలు మార్చుకునే గదులు ఉన్నప్పటికీ అధికారులు వాటికి మర మ్మతులు చేయించి సిద్ధం చేయలేదు. మహా జాతరకు ముందుగానే వేలాది మంది భక్తులు తల్లులను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో మహిళా భక్తులకు బట్టలు మార్చుకొనే గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు దీనిపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధే నా లక్ష్యం.. గెలిపించండి

ఎన్నికల ప్రచారంలో గోవిందరావుపేట సర్పంచ్ అభ్యర్థి జోగానాయక్



గోవిందరావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి జోగానాయక్

గోవిందరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ బలపరిచిన తనకు ఓటు వేసి గెలిపించాలని గోవిందరావుపేట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి లావుడ్యా జోగానాయక్ అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కత్తెర గుర్తుకు ఓట్లు వేసి గెలిపించినట్లయితే పంచాయతీ అభివృద్ధి కోసం మంత్రి ధనసరి సీతక్క సహకారంతో అధిక నిధులు వెచ్చిస్తాన న్నారు. బీఆర్ఎస్ పదేళ్లకాలంలో గ్రామం ఎలాంటి అభివృద్ధి చెందలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని వివరిం చారు. అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు. అదేవి ధంగా వీధివీధికి సీసీరోడ్ల నిర్మాణం తోపాటు సైడ్ డ్రెయినేజీలను నిర్మించ నున్నట్లు పేర్కొన్నారు. తనకు ఓటువేసి గోవిందరావుపేట పంచాయతీ అభివృ ద్ధికి బాటలు వేయాలని ఆయన ప్రజల ను కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంక టకృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, నాయకులు రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆటోలో వెళ్తున్న వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న జోగానాయక్

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

ఏటూరునాగారం సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : గంగదేవిపల్లిలా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్దిదిద్దుతానని బీఆర్ఎస్ బలపరు స్తున్న సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత లక్ష్మీనరసింహారావు అన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో సోమ వారం ఇంటింటా ప్రచారం చేశారు. ఉంగరం గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కాకులమర్రి శ్రీలత మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంతో ఎన్ని కల్లో పోటీ చేస్తున్నా నన్నారు. నిస్వార్థ సేవలను అందించి ప్రజల మన్న నలు పొందుతానని అన్నారు. అవినీతి రహిత పాలనను గ్రామ ప్రజలకు అందిస్తానని హామీ ఇచ్చారు. తమది కొన్ని సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్న కుటుంబం అన్నారు. ప్రజలు ఆదరణ చూపుతారన్న నమ్మకముందని



ప్రచారం నిర్వహిస్తున్న కాకులమర్రి శ్రీలత లక్ష్మీనరసింహారావు

ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పం దన వస్తోందని తెలిపారు. గ్రామ ప్రజలు తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు కష్టకాలం

(5వ పేజీ తరువాయి)

చేయాల్సిన బాధ్యత కూడా కార్యదర్శులదే. పోలింగ్ కేంద్రాల్లో బెంచీలు, కుర్చీలు, వాటి ముందు టెంట్లు, తాగునీరు తదితర ఏర్పాట్లను కూడా వారే చూడాలి. దీని కోసం కూడా మరో రూ 20వేల దాక ఖర్చుకానున్నది. దీనిని కూడా వారే భరించాల్సి ఉన్నది.

ఇప్పటికే రెండేళ్లుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిదులు రాక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మళ్లీ ఎన్నికల ఖర్చు ఒకటి వచ్చి పడింది. డబ్బులు జేబులోంచి పెట్టుకోవలిసి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ అధికారులుగా కొందరు పంచాయతీ కార్యదర్శులు పని చేశారు. భత్యం చెల్లిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు ఇవ్వలదేని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1708 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

నిర్భయంగా ఓటు వేయాలి : భూపాలపల్లి డీఎస్పీ



చిట్యాలలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చిట్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో పోలీసులు సోమవారం భారీ ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ప్రధాన రహదారిపై మీదుగా ఇది కొనసాగింది. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. పంచా యతీ ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసుశాఖ తమ బాధ్యతలను నెరవేరు స్తుం దన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్విని యోగం చేసుకోవాలన్నారు. సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్, రెండో ఎస్సై హేమ, మూడో ఎస్సై ఈశ్వరయ్య, ఏఎస్సైలు సమ్మిరెడ్డి, మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్ (టి) గ్రామం నుంచి టేకుమట్ల మండల కేంద్రం వరకు పోలీసులు, ఆర్మీ, స్పెషల్ ఫోర్సులతో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సంపత్‌రావు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో ముగిసేలా సహకరించాలన్నారు. హింసాత్మక ఘటనకు ప్రేరేపించినా, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్. స్థానిక ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తనయుడికి నిరసన సెగ

సంక్షేమ పథకాల అమలపై ప్రజల నిలదీత



సూర్యతో మాట్లాడుతున్న స్థానికులు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో సోమవారం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి సీతక్క తనయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంజా సూర్యకు చేదు అనుభవం ఎదురైంది. ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో కాంగ్రెస్ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన్ను పలువురు స్థానికులు నిలదీశారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని సూర్య కోరగా అధికారంలోకి వచ్చిన రెండేళ్లకాలంలో కాంగ్రెస్ చేసిందేమిటని ప్రశ్నించారు. ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వార్డు ప్రజలకు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత సూర్యతోపాటు ఇతర కాంగ్రెస్ నేతలు అక్కడి నుంచి మరో వార్డుకు ప్రచారం కోసం వెళ్లిపోయారు.